జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.


epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 31-08-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 115 పేజీలు: 8 వెల : రూ.7



## వణికిస్తున్న డెంగ్యూ.. భూతం

* ఇప్పటి వరకూ 28 మందికి
* విజృంభిస్తున్న మలేరియా, డెంగ్యూ విష జ్వరాలు
* గ్రామాలలో కానరాని పారిశుధ్య పనులు
* పంచాయతీల్లో నిధుల లేమి కారణం
* మంచం పట్టిన పల్లెలు
* కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు

**శ్రీకాకుళం, ఆగస్టు 30 (వార్త):** గత నెల రోజులుగా మలేరియా, డెంగ్యూ వంటి విష జ్వరాలు జిల్లావాసులను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఇంటికొకరు చొప్పు విష జ్వరాల బారిన పడ్డారు. ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. డెంగ్యూ జ్వరం వ్యాప్తితో ప్రజలు భీతిల్లుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 28 మంది డెంగ్యూతో బాధపడుతున్నారని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారులు చెబుతున్నారు. అయితే ఈ సంఖ్య మూడు రెట్లు అధికంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. చాలా మంది డెంగ్యూతో ప్రాణాలు కూడా విడిచారు. ఇటీవల సోంపేట మండలంలో నలుగురు, కంచిలి మండలంలో ఇద్దరు డెంగ్యూతో మృత్యువాత పడ్డారు. కేవలం ఈ నెల రోజుల్లోపు డెంగ్యూ జ్వరాలతో సుమారు 30 మంది వరకూ మృతి చెంది ఉంటారని కొందరు వైద్యులు చెబుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా జరగకపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ దోమలు వల్ల ప్రజలు విషజ్వరాలు, డెంగ్యూ బారిన పడుతున్నారు. పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పలువురు విషజ్వరాలకు గురవుతున్నారు. కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీలలో చెత్త పేరుకుపోయి మురుగు అంతా రహదారుల పైనుంచే ప్రవహిస్తుంది. ఈ మురుగు ద్వారా దోమలు వృద్ధి చెంది పరిసరాలు కలుషితమై విష జ్వరాలు మలేరియా డెంగ్యూ తో పాటు అతిసారం వ్యాధులు వ్యాప్తి చెందుతున్నట్టు ప్రాథమిక నిర్ధారణ. ఇక గ్రామీణ ప్రాంతాలలో చాలామందికి ఈ జ్వరాలపై అవగాహన లేకపోవడంతో ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. స్థానికంగా ఉండే సంచి వైద్యుల సలహాలను పాటిస్తూ.. లేదంటే తమ సొంత జ్ఞానాన్ని ఉపయోగించి జ్వరం వచ్చిందంటే ఏ పారాసిటమాలో, డోలోను ఉపయోగిస్తూ సొంత వైద్యం చేపడుతున్నారు. దీంతో, పైకి జ్వరం తగ్గుతున్నా, లోలోపల జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. చేతులు కాలాక అన్న చందాన అప్పుడు హడావిడిగా ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆసుపత్రులకు చేరుతున్నారు. ఈలోగా వైద్యులు రోగ నిర్ధారణ పరీక్షలు చేసేటప్పటికి, వచ్చే ఫలితాలు వారికి ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రస్తుత జ్వరాలు ఇల్లును ఒల్లును గుల్ల చేసి పోతున్నాయని జ్వర పీడితులు చెబుతున్నారు. వైద్యఆరోగ్యశాఖ ఆయా పీహెచ్‌సీల పరిధిలో మరిన్ని వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్సఅందించకుంటే డెంగ్యూ మరణాలు తగ్గే అవకాశం లేదు.

### శ్రీముఖలింగంలో డెంగ్యూ కలకలం

**జలుమూరు:** శ్రీముఖలింగం పొందరవీధికి చెందిన పైడి లక్ష్మీనారాయణకు డెంగ్యూ లక్షణాలు కనిపించాయి. దీంతో అచ్చుతాపురం పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది అప్రమత్త మయ్యారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించి, దోమల నివారణకు చర్యలు చేపట్టారు. అచ్యుతాపురం వైద్యాధికారి పి.సుజాత మాట్లాడుతూ లక్ష్మీనారాయణకు రాపిడ్ పరీక్షలో డెంగ్యూ పాజిటివ్ కనిపించిందని, పూర్తిస్థాయి నిర్ధారణకు శ్యాంపిళ్లను శ్రీకాకుళం రిమ్స్‌కు పంపించామన్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలు సేకరణకు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### జిల్లాలో 28 డెంగ్యూ కేసులు: డీఎంహెచ్‌వో మీనాక్షి




జిల్లా వ్యాప్తంగా విజృంభిస్తున్న సీజనల్ జ్వరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య శాఖాధికారిణి బొడ్డేపల్లి మీనాక్షి పిలుపునిచ్చారు. శుక్రవారం కంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 28 డెంగ్యూ కేసులు ఉన్నాయన్నారు. చిన్నారి ఝాన్సీ మృతి తనకు తీవ్రంగా కలిచివేసిందన్నారు. ఆ పాప డెంగీ తో చనిపోలేదని స్పష్టం చేశారు. ఫీవర్ సర్వేను జిల్లా వ్యాప్తంగా చేపడతామని చెప్పారు. చిన్నారి ఝాన్సీ కుటుంబ సభ్యులను కలిసి పాప మృతికి గల కారణాలను విశ్లేషించారు. జ్వరం వచ్చిన తేదీ నుంచి వాళ్లు ఏ ఏ ఆసుపత్రులలో చికిత్స పొందారో, వివరాలు సేకరించారు. ఆ చిన్నారి వైద్యానికి వినియోగించిన మందుల వివరాలను తెలుసుకున్నారు. ఆమెతోపాటు, జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ, డాక్టర్ హరిబాబు, నాగేంద్ర, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రానైట్ పరిశ్రమలు మూసివేస్తాం

* విశ్వసముద్ర అధికారులు వేధిస్తున్నారు
* టెక్కలిలో ఆందోళనకు దిగిన గ్రానైట్ పరిశ్రమల నిర్వాహకులు

**టెక్కలి, ఆగస్టు 30 (వార్త):** గ్రానైట్ పరిశ్రమలను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి.. విశ్వసముద్ర సంస్థకు చెందిన కొందరు అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారు.. ఇలా అయితే పరిశ్రమలు నడపలేం మూసివేస్తాం.. అని గ్రానైట్ పరిశ్రమల ప్రతినిధులు, పాలిసింగ్ యూనిట్ నిర్వాహకులు శుక్రవారం టెక్కలిలో ఆందోళనకు దిగారు. గ్రానైట్ అసోసియేషన్ నేతలు గోపి,నవీన్ చౌదరి మీడియాతో మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో గత 16 నెలలు నుంచి విశ్వసముద్ర అనే సంస్థ పర్మిట్లు జారీ చేస్తూ డబ్బులు వసూలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ విధానాన్ని రద్దు చేస్తుందని గ్రానైట్ వర్గాలు ఎదురుచూశాయన్నారు. అయితే సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి మళ్లీ ఇదే సంస్థకు ప్రభుత్వం పగ్గాలు అప్పుజెప్పిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం హయంలో విశ్వసముద్ర కన్స్ట్రక్షన్స్ కంపెనీ అధికారులతో కుమ్మక్కై అదనపు వసూలు చేశారన్నారు. ముందుగానే అదనంగా డబ్బులు వసూలు చేసుకున్నారని తెలిపారు వెంటనే ఈ సొమ్మును చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. గత వైఎస్ఆర్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అధికారులు విశ్వసముద్రతో కుమ్మక్కై పాలిసింగ్ యూనిట్ నుంచి 25 శాతం అధికంగా రుసుము వసూలు చేసి పరిశ్రమ నష్టాల్లో కూరుకు పోయే విధంగా మారారన్నారు. గ్రానైట్ అసోసియేషన్‌కి రాయితీలు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో 25 స్లాబ్ రాయితీ ఉన్నా శ్రీకాకుళం జిల్లాలోని అమలు చేయడం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ అధికారులతో విశ్వసముద్ర కన్స్ట్రక్షన్స్ ప్రతినిధులు గ్రానైట్ పరిశ్రమల నిర్వాహకులకు వేధించిందని, సెప్టెంబరు 1 నుంచి మళ్లీ అదే సంస్థకు కూటమి ప్రభుత్వం పగ్గాలు కట్టడం తమకు ఆందోళనకు గురిచేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగానే విశ్వసముద్ర కన్స్ట్రక్షన్స్ వేధింపులకు పాల్పడితే గ్రానైట్ అనుబంధ పరిశ్రమలు మూత వేయవలసి వస్తుందన్నారు. అంతకుముందు జిల్లా గ్రానైట్ అధికారులకు, విశ్వసముద్ర కన్స్ట్రక్షన్స్ జనరల్ మేనేజర్ వినతిపత్రం అందజేశారు.



## పలాస-కాశీబుగ్గలో.. ఎనీటైం మందు





* జంట పట్టణంలో నిబంధనలు పాటించని పలుబార్ల నిర్వాహకులు
* కాసులకు కక్కుర్తి పడి పట్టించుకోని సెబ్ అధికారులు
* కౌన్సిల్ తీర్మాణం బేఖాతర్

**పలాస, ఆగస్టు 30 (వార్త):** బార్‌లు 24 గంటలు బార్లా తెరిచివుంటున్నాయి. ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. అంతా మా ఇష్టం అన్న రీతిన వ్యవహరిస్తున్నాయి. ఎప్పుడు మద్యం కావాలన్నా ఇస్తామన్న ధోరణిలో కొందరు నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. ఎవరైనా ఇదేంటని ప్రశ్నిస్తే అంతా మా ఇష్టం అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడమే గాకుండా దాడులకు సైతం పాల్పడుతున్న ఉదంతాలు పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నాయి. జిల్లాలో ఎక్కడా లేని విధంగా కేవలం పలాస-కాశీబుగ్గలో జరుగుతున్న ఈ బార్లు తంతు వెనుక పెద్ద కథే నడుస్తుందని టాక్. జంటపట్టణాల్లో ఎనీటైం మందు బార్లు అనే వార్తా కథనాలు వెలువడి, సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన నేపథ్యంలో కౌన్సిల్‌లో దీనిపై పెద్ద చర్చ జరిగింది. ఈ మద్యం అమ్మకాలపై కౌన్సిల్ కమిటీ ఏర్పాటు చేసింది. కౌన్సిల్ తీర్మానం జరిగి వారం తిరగక ముందే మళ్లీ బార్ల పరిస్థితి యథావిధిగా కొనసాగుతుంది. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్వహించాల్సిన బార్లు ఉదయం 6 గంటలకే తెరుస్తున్నారు. ఆయా బార్ల నిర్వాహకులు కౌన్సిల్ తీర్మానంపై డోంట్ కేర్ అంటున్నారు. ఎక్సైజ్, పోలీసు అధికారులకు కాసులు కురుస్తుండడంతో వారు కూడా మౌనం వహిస్తున్నారన్న విమర్శలు ప్రజల నుంచి వినిస్తున్నాయి. దీనికితోడు బార్లలో మద్యం రేట్లు సైతం ఆకాశాన్ని అంటున్నాయి. బార్లలో ఫుల్ బాటిల్ మద్యం లూజు అమ్మకాలు జరపవలసి ఉండగా, అందుకు విరుద్ధంగా అక్కడ సాగుతున్నాయి.

## సెల్ఫ్ అసెస్మెంట్-1 పరీక్ష పత్రాల పంపిణీ



నరసన్నపేట, ఆగస్టు 30(వార్త): సెల్ఫ్ అసెస్మెంట్-1 పరీక్ష పత్రాలను నరసన్నపేట ఎంఈవో కార్యాలయంలో పంపిణీ చేయనున్నట్టు ఎంఈవో-2 దాలినాయుడు శుక్రవారం తెలిపారు. పాఠశాలల్లో జరుగుతున్న ఈ పరీక్షలకు ప్రశ్నాపత్రాలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ పరీక్షలను అన్ని పాఠశాలల్లో పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. విద్యార్థులను బాగా చదివించి, పరీక్షలు బాగా రాసేలా ఉపాధ్యాయులందరూ పనిచేయాలన్నారు.

# తప్పుడు ఫిర్యాదులను పట్టించుకోవద్దు

**■ విజిలెన్స్ అధికారులకు పలాస మున్సిపల్ కౌన్సిల్ విజ్ఞప్తి**



పలాస, ఆగస్టు 30(వార్త): పలాస మున్సిపాలిటీలో జరిగే అభివృద్ధి పనులపై బుల్లు ప్రధాన్ అనే వ్యక్తి పదేపదే విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అవి నిలిచి, కాంట్రాక్టరుకు బిల్లులు కావడం లేదు... తప్పుడు ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకోవద్దని మున్సిపాలిటీ తీర్మానం చేయాలని సభ్యులకు మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు సూచించారు. దీనిపై సభ్యులు తీర్మానం చేశారు. ఈ కాపీలను విజిలెన్స్, మున్సిపల్, పోలీసు ఉన్నతాధికారులకు నోట్ తయారు చేసి పంపించాలని కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌కు చైర్మన్ ఆదేశించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ సమావేశ మందిరంలో శుక్రవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తప్పుడు ఫిర్యాదులపై చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, గుజ్జు జోగారావు, దుర్గాశంకర్‌పండా, గురిటి సూర్యనారాయణ, జోగ త్రివేణి, డొక్కరి తులసి మాట్లాడారు. మహాత్మగాంధీ షాపింగ్ కాంప్లెక్స్, ఐడీఎస్ఎంటీ దుకాణదారులు బకాయిలపై కొంత గడువు ఇవ్వాలని కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ కోరారు. గడువు ఇస్తామని చైర్మన్, కమిషనర్ తెలిపారు. కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ మాట్లాడుతూ తమ వార్డులో కాలువ పూడికతీతకు రూ.3 లక్షలు పెట్టారని, ఒక్క కాలువకా, వార్డు మొత్తానికా అని ప్రశ్నించారు. వార్డులో ఎక్కడైనా పనులు చేసుకోవచ్చని చైర్మన్ గిరిబాబు తెలిపారు. వార్డుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులకు సమాచారం లేకుండా పనులు ఎలా చేస్తారని, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ వజ్జ బాబూరావు కోరారు. తమ వార్డులో రెండేళ్ల క్రితం కాలువ కోసం ఐదు లక్షలు మంజూరు చేసినా, పనులు జరగలేదని, ఈ పనులు సకాలంలో పూర్తి చేయాలని కౌన్సిలర్ గుజ్జు జోగారావు విన్నవించారు. సమావేశంలో వైస్ చైర్మన్ బోర బుజ్జి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యంతో వాడవాడలా విజృంభిస్తున్న వ్యాధులు

**● మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి**



కొత్తూరు, ఆగస్టు 30 (వార్త): ప్రభుత్వ వైఫల్యంతో గ్రామాల్లో పారిశుధ్య లోపించి, వివిధ వ్యాధులు, విషజ్వరాల బారిన ప్రజలు పడుతున్నారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు.

శుక్రవారం ఆమె పాతపట్నంలోని క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. ప్రజారోగ్యాన్ని సీఎం చంద్రబాబు గాలికి వదిలేశారని విమ ర్శించారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకుండా నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైసీపీ హయాంలో ప్రజారోగ్య రంగాన్ని పటిష్టం చేసేందుకు పలు విప్లవాత్మక సంస్కరణలు చేపట్టామని తెలిపారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ గ్రామ-వార్డు సచివాలయ వాలంటీర్ల ద్వారా ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించి ఎప్పటికప్పుడు ప్రజల ఆరోగ్య స్థితిగతులను ప్రభుత్వం సేకరించి ప్రతి ఒక్కరికి సకాలంలో అవసరమైన వైద్య సేవలు అందించారన్నారు.

# ఆదివాసీ హక్కుల పోరాట సదస్సును విజయవంతం చేయండి




పలాస, ఆగస్టు 30(వార్త):ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ సదస్సు నెల్లూరులో వచ్చేనెల ఒకటిన నిర్వహిస్తున్నామని ప్రజాసంఘాలు తెలిపాయి. ఆ సదస్సు కరపత్రాన్ని పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల మందిరంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ నాయకుడు వంకలు మాధవరావు మాట్లాడుతూ నెల్లూరు సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వీరాస్వామి, లక్ష్మణ, గంగయ్య, బాలరాజు, పిండి వెంకటరావు, తెప్పల ఢిల్లీరావు, వైకుంఠరావు పోలవరం లక్ష్మణ్, చిరంజీవి, నాగమణి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి సీదిరి



మందస, ఆగస్టు 30 (వార్త): భైరిసారంగపురం, వీరగున్నమ్మపురం, టంగరాపుట్టి గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శుక్రవారం పరామర్శించారు. ఆయా కుటుంబాలను ఓదార్చి, సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, సర్పంచ్ కర్రి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చినబాడాంలో వైద్య శిబిరం విజయవంతం



పలాస, ఆగస్టు 30(వార్త): చినబాడాంలో శుక్రవారం జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సాధారణ వ్యాధులతో పాటు కిడ్నీ, కంటి గుండె, క్యాన్సర్ పరీక్షలు రోగులకు జరిపారు. ఉచితంగా మందులు అందజేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, గ్రామస్తులు, గ్రామ యువత పాల్గొన్నారు.

## ఎస్ఐ ఖాదర్‌ను కలిసిన టీడీపీ నేతలు



మందస, ఆగస్టు 30 (వార్త): మందస ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.కె. ఖాదర్ బాషాను శుక్రవారం తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. దాసరి తాతారావు, డుంకురు తిరుపతి, భైరిశెట్టి గున్నయ్య, మామిడి తాతారావు, కుప్పిలి వెంకటరావు, మురళీకృష్ణచౌదరి, మంగళపాత్రో, గుంటు రమేష్, సాలీన భీమారావు, మండల లచ్చయ్య, తలగాన రాజశేఖర్, పత్రి లక్ష్మణరావు, బుడ్డుపు కృష్ణారావు, కొర్రాయి శ్యామ్, బదకల వెంకటరావు, దుబ్బ తులసి తదితరులు ఎస్ఐను కలిసి పుష్పగుచ్ఛంతో అభినందించారు. శాంతిభద్రతల రక్షణలో తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

## నేత్రదానం చేయండి



నరసన్నపేట, ఆగస్టు 30(వార్త): అంధులకు నేత్రదానం ద్వారా తిరిగి చూపును ప్రసాదించవచ్చని మాకివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్ర కంటి శస్త్ర సహాయ నిపుణులు బాలగంగాధర్‌రాజు తెలిపారు. శుక్రవారం శివనగర్ వద్ద ఉన్న జిల్లా పరిషత్ యూపీ స్కూల్లో నేత్రదాన పక్షోత్సవాలను చేపట్టారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. నేత్రదానంపై అవగాహన కల్పించారు.

## అర్హత మేరకే వికలాంగ ధ్రువీకరణపత్రాలు



నరసన్నపేట, ఆగస్టు 30(వార్త): ప్రభుత్వ ఆదేశాల మేరకు వికలాంగత్వం ఉన్నవారికి మాత్రమే ధ్రువపత్రం మంజూరు చేస్తామని ఆర్థోపెడిక్ సర్జన్ రమణరావు తెలిపారు. శుక్రవారం ఆయన నరసన్నపేట సీహెచ్‌సీలో సదరం పరీక్షలనునిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కచ్చితమైన వివరాలను సేకరించి ధ్రువీకరిస్తామని స్పష్టం చేశారు. 15 మందికి వికలాంగ పరీక్షలు జరిపారు.

## రావులవలసలో ఉచిత వైద్య పరీక్షలు

నరసన్నపేట, ఆగస్టు 30(వార్త):రావులవలసలో శుక్రవారం 104 వాహనంలో మాకివలస పీహెచ్‌సీ వైద్యులు సేవలందించారు. స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామన్నారు.

## ముమ్మరంగా వాహన తనిఖీలు



పాతపట్నం, ఆగస్టు 30(వార్త): పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఏవోబీ సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద సీఐ నల్లి సాయి ఆధ్వర్యంలో ఎస్ఐ లావణ్య, పోలీస్ సిబ్బంది వాహన తనిఖీలు ముమ్మరంగా నిర్వహించారు. గంజాయి, మద్యం, సారా, గుట్కా వంటివి అక్రమంగా రవాణా చేసేవారిపై చర్యలు తీసుకుంటామని సీఐ సాయి తెలిపారు.

## శిశు లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన

జలుమూరు, ఆగస్టు 30(వార్త): కరకవలస గ్రామంలోని గర్భిణులకు శుక్రవారం శిశు లింగనిర్ధారణ చట్టంపై అచ్యుతాపురం వైద్యురాలు పూజారి సుజాత అవగాహన కల్పించారు. హెచ్ఎస్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, బియ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## వాహనాలను మైనర్లు నడపొద్దు

మందస, ఆగస్టు, 30 (వార్త): వాహనాలను మైనర్లు నడపవద్దని మందస ఎస్ఐ ఎస్.కె. ఖాదర్‌బాషా హెచ్చరించారు. శుక్రవారం ఆయన.. హరిపురంలో వాహనాలను నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు. తల్లితండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని కోరారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ప్రజలు సహకరిస్తేనే నేర నివారణ సాధ్యపడుతుందన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.


మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ ఖాదర్‌బాషా

# పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

**వాడవాడలా వనం-మనం**
**మొక్కలు నాటిన ఎమ్మెల్యేలు, అధికారులు**



పలాస, ఆగస్టు 30(వార్త): పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ మొక్కలు నాటాలని ఆర్డీవో డాక్టర్ భరత్‌నాయక్ కోరారు. అటవీ శాఖ, గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో వనమహోత్సవం సందర్భంగా ఆయన బాదం, కదంబ, కొబ్బరి, చెర్రీ, అశోక్, నేరడి, ఉసిరికాయ తదితర మొక్కలను నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, మున్సిపల్ కమిషనర్ నాగేంద్రబాబు,వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, ఎంపీడీవో రమేష్‌నాయుడు, తహసీల్దార్ బి.సత్యం, ఎంఈవో శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ వజ్జ బాబూరావు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనేలు గోపాల్, అంబటి మాధురి, పైల చక్రధర్, అటవీ, ఉద్యాన శాఖ సిబ్బంది బీటీ రావు, హుస్సేన్ దిలీప్, వివిధ శాఖల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస, ఆగస్టు 30(వార్త): పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచడం సామాజిక బాధ్యతగా చేపట్టాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన వనం-మనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకీ అంతరించిపోతున్న చెట్లు మానవాళి మనుగడకు ప్రమాదకరమైన సూచన అన్నారు. భావితరాల మనుగడకు వన సంరక్షణ ఒక్కటే పరిష్కారం అని తెలిపారు. కార్యక్రమంలో అందరితో పాటు వన సంరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. ఎన్‌సీసీ విద్యార్థుల పరేడ్ అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్, పురపాలక సంఘం కమిషనర్ పి.బాలాజీప్రసాద్, తహసీల్దార్ ఎస్. రాంబాబు, ఎంపీడీవో వాసుదేవరావు, తెదేపా నాయకులు విద్యాసాగర్, డాక్టర్ రాజారెడ్డి, కూన భానోజీరావు, ముద్దు కృష్ణ, జన సైనికులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






**సారవకోట:** కాలుష్య రహిత సమాజాన్ని తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు కోరారు. శుక్రవారం ఆయన సారవకోట మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో తహసీల్దార్, ఎంఈవో పాల్గొన్నారు.



**జలుమూరు:** పర్యావరణ పరిరక్ష ణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ వాన గోపి అన్నారు. జలుమూరులోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో శుక్రవారం ఆయన అధికారు లతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో తదితరులు పాల్గొన్నారు.ప్రతి ఒక్కరూ మొక్కలు తప్పనిసరిగా నాటితే భవిష్యత్తులో పర్యావరణాన్ని కాపాడవచ్చని రాయపాడు పంచాయతీ సర్పంచ్ బోర భారతి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక సచివాలయం వద్ద మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గుండ ఆదెమ్మ, పంచాయతీ కార్యదర్శి ఎస్.చిన్నా రావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. లింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వన మహోత్సవం చేపట్టామని ప్రధానోపాధ్యాయుడు ఉంగటి అప్పలసూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బమ్మిడి శ్రీనివాసరావు, జల్లు రమణమూర్తి, గార విశ్వనాథం, డొంకాన కాత్యాయిని పాల్గొన్నారు.



**మందస:** మొక్కలను నాటి, సంరక్షిస్తే మానవ మనుగడ ఉంటుందని పలువురు వక్తలు అన్నారు. మందస మండలంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, డిప్యూటీ తహసీల్దార్ మద్దిల కృష్ణమూర్తి, ఏపీవో బి.వి.హరికృష్ణ, టీసీ చింతా సురేష్‌వర్మ, ఉపాధి హామీ సిబ్బంది మొక్కలు నాటారు. బాలిగాంలో టీడీపీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, సర్పంచ్ తలగాన చంద్రశేఖర్,మండలమహిళా సమాఖ్య కార్యాలయం వద్ద ఏపీఎం గొడబ ప్రసాదరావు, జమ్మా శ్రీనివాసరావు, సీహెచ్ తారక్‌మోహన్, డొంకాన కల్యాణి, ఎస్.రాజా మొక్కలు నాటారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులానికి తలగాన మహేశ్ మొక్కలు వితరణగా అందించారు. అల్లుమల నారాయణరావు, చింతాడ లక్ష్మీనారాయణ, బుసకల మురళీబాబు, మిస్క గణపతి, మద్ది సత్యవరప్రసాద్, మల్లారెడ్డి తిరుపతి, మద్ది సురేష్, మల్లారెడ్డి జగన్‌తో కలిసి నాటారు.







**కొత్తూరు:** పారాపురం పంచాయతీలోని కలిగాం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వనం-మనంలో టీడీపీ నాయకులు, కొత్తూరు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాద్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి పెంచే బాధ్యత కూడా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సవర సావిత్రి, సర్పంచ్ సనపల కోటేశ్వరరావు, ఏపీవో ప్రేమలత, ఎంపీడీవో పావని, ఫీల్డ్ అసిస్టెంట్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**పోలాకి:** కాలుష్య నివారణకు ప్రభుత్వం వనం-మనం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ఇటువంటి మహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామం కావాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన పోలాకి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో, ప్రభుత్వ కార్యాలయాల్లో, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి, వాటిని పెంచే బాధ్యత కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. మానవజాతి మునగడకు వృక్షాలు ఎంతో మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొద్దు భాగ్యలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భైరి భాస్కరరావు, మాజీ సర్పంచ్ లుకలాపు రాంబాబు, తహసీల్దార్, కళాశాల ప్రిన్సిపాల్, ఇతర ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో హరిత వనాలు అభివృద్ధి చెందే దిశగా కృషి చేయాలని ఎమ్మెల్యే బొగ్గు రమణమూర్తి కోరారు. పోలాకిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద వనం-మనంలో భాగంగా ప్రతిజ్ఞ నిర్వహించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో స్వచ్ఛందంగా మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



## లింగ నిర్ధారణ పరీక్ష చట్టరీత్యా నేరం



**పలాస, ఆగస్టు 30 (వార్త):** తల్లి గర్భంలో పెరుగుతున్న బిడ్డను తెలుసుకొనేందుకు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని పలాస ఆర్డీవో భరత్ నాయక్ ఆసుపత్రి నిర్వాహకులకు హెచ్చరించారు. కాశీబుగ్గ శివ దుర్గా ప్రియా ఆసుపత్రిలోని స్కానింగ్ రూంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం అన్నారు. ప్రభుత్వ నిబంధనకు లోబడి స్కానింగ్ సెంటర్లు నడపాలన్నారు. స్కానింగ్ సెంటర్లుకు వచ్చిన ప్రతి రోగి, గర్భిణీ వివరాలు నమోదు చేసి రిజిస్టర్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పి సి పి ఎన్ డి టి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సిద్దా బత్తుల సూర్యకళ, కాశీబుగ్గ ఎస్సై రేవతి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటికో మొక్క నాటండి

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



**కోటబొమ్మాళి/టెక్కలి, ఆగస్టు30 (వార్త):** ఇంటికో మొక్క నాటి సంరక్షించడం వల్ల పర్యావరణానికి మేలు చేసిన వారు అవుతారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం కోటబొమ్మాళి మండలం వాండ్రాడ పంచాయతీ సుబ్బారావుపేట గ్రామంలో వనమహోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు పుట్టినరోజులకు, పెళ్లిరోజులకు, ఇంటి పెద్దల



జ్ఞాపకార్థం మొక్కలు నాటాలన్నారు. నాయకులు బాధ్యతగా తమ గ్రామాలలో, ఇంటి ప్రాంగణాల్లో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఏపీలో 29 శాతం ఉన్న పచ్చదనాన్ని ఈ ఐదేళ్లలో 50 శాతానికి తీసుకువెళు తామన్నారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### జడ్పీలో వనం.. మనం

**శ్రీకాకుళం టౌన్:** వనం మనం కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఈవో డి.వెంకటేశ్వరరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడండి

**ఎల్ఎన్‌పేట, ఆగస్టు 30 (వార్త):** వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం లక్ష్మీనర్సుపేట ప్రాథమిక పాఠశాలలో మామిడి మొక్కలను ప్రధానోపాధ్యాయుడు లయన్ డా.ఎం.కె.మిశ్రో మాస్టారు, ఉపాధ్యాయుడు టి.ఉపేంద్ర, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుడు సంతోష్ మహాపాత్రో నాటారు. ఈ సందర్భంగా మిశ్రో మాస్టారు మాట్లాడుతూ విద్యార్థులు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్య క్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



## హరితాంధ్ర కోసం మొక్కలు నాటుదాం



**పలాస, ఆగస్టు30 (వార్త):** హరితాంధ్ర ప్రదేశ్ కోసం ప్రతి ఒక్కరం మొక్కలు నాటు దామని ఆర్డీవో భరత్ నాయక్ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ అటవీ శాఖ, గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో పలాస ఇందిరా గాంధీ బొమ్మ దరి ఎంపిఈ స్కూల్‌లో వన మహోత్సవంలో భాగంగా పలు రకాల మొక్కలు నాటారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ పర్యావరణ హితం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల న్నారు. అడవులు తగ్గుతున్న సందర్భంగా సోషల్ ఫారెస్ట్‌ను ప్రోత్సహించే విధానంలో భాగంగా కాశీబుగ్గ ప్రాంతానికి ప్రత్యేకమైన నిధులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేటాయించిందన్నారు. మున్సిపల్ చైర్మన్ బల్ల గిరి బాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, వాతావరణ సమతుల్యానికి మొక్కలు దోహద పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ టీ నాగేంద్ర కుమార్, ఎంపీడిఓ రమేష్ నాయుడు, తహశీల్దార్ బి.సత్యం, ఎంఈఓ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు వజ్జ బాబురావు, దువ్వాడ శ్రీకాంత్, గురిటి సూర్యనారాయణ, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, కౌన్సిలర్ అంబటి మాధురి ఆనంద్, పైల చక్రధర్, అటవీ శాఖ సిబ్బంది, హార్టికల్చర్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, ఎన్ ఆర్ జి ఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, గ్రీన్ ఆర్మీ సభ్యులు బిటి రావు, హుస్సేన్ దిలీప్ విద్యార్థులు పాల్గొన్నారు.

### సూర్యతేజ కళాశాలలో..

వన మహోత్సవం సందర్భంగా కాశీబుగ్గ సూర్య తేజ జూనియర్, డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ దానేటి పద్మజ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, సకాలంలో వర్షాలు పడడానికి మొక్కలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్పీ పరిష్కార వేదికకు 13 ఫిర్యాదులు

**పలాస, ఆగస్టు30(వార్త):** కాశీ బుగ్గ పోలీస్ స్టేషన్లో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 13 ఫిర్యాదులు వచ్చాయని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి తెలి పారు. జిల్లా ఎస్పీ స్వయంగా 13 మంది ఫిర్యాదు దారుల నుంచి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సత్వర న్యాయం అందించేలా కృషి చేస్తామన్నారు. సివిల్ అంశాలపై 5, ఆస్తి నేరాలపై 4, ఇతరత్రా అంశా లపై 5 ఫిర్యాదులను స్వీకరించారు.




## రక్తదానంలో భాగస్వాములు కావాలి

### జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్




**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 30(వార్త):** రక్తదానం మహాదాన మని దీనిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ స్వప్నల్ దిన కర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం రెడ్‌క్రాస్ భవనంలోని బ్లడ్‌బ్యాంకులో సర్ జీన్ హెన్రీ డునాంట్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం వనం మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమా వేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వన మహోత్సవం సందర్భంగా శ్రీకాకుళం రెడ్ క్రాస్ ద్వారా గత సంవత్సరం సుమారు 50వేలకు పైబడి మొక్కలు నాటడం అభి నందనీయమన్నారు. ఈ ఏడాది ఎన్ని మొక్కలు అవసరమో యాక్షన్ ప్లాన్ రూపొందించి ఇస్తే అందజేస్తామన్నారు. రక్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించా లని సూచించారు. సుమారు రోజుకి 300 యూనిట్లు రక్త నిలువలు సేకరించా లని వాటికి కావలసిన సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. 18ఏళ్లు నిండిన యువత రక్తదానానికి ముందుకు రావాలన్నారు. ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం చేయవచ్చని కలెక్టర్ గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ పి.జగన్మోహనరావు, డా.త్రినాధ్‌రావు, డా.పుష్పలత, నిక్కు అప్పన్న, డా. కిల్లి చిన్న బాబు, ఆర్ట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నూక సన్యాసి రావు, ట్రెజరర్ దుర్గా శ్రీనివాసరావు, రెడ్ క్రాస్ ప్రోగ్రామ్ మేనేజర్ జి.రమణ, పెంకి చైతన్యకుమార్, సతీష్ కుమార్, సుజాత, కళ్యాణ్ చక్రవర్తి, చిన్మయిరావ్, డాక్టర్ శ్రీకాంత్, అయేషా బేగం, ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.




## చట్టం ముందు అందరు సమానులే

**శ్రీకాకుళం లీగల్, ఆగస్టు 30 (వార్త):** నగరంలోని ఆర్‌సీఎం జూనియర్ కళాశాలలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. సీని యర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. న్యాయం చట్టం ముందు అందరూ సమాను లేనన్నారు. విద్యార్థులు చట్టంపై అవగాహన కలిగి వుండాలన్నారు. అప్పుడే నేరాలు తగ్గుముఖం పడతాయని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతులు కావాలని, దురలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ జి.ఇందిరా ప్రసాద్, కరస్పాండెంట్ ఎం.శశికళ, ప్రిన్సిపాల్ ఎం.శాంతి, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

## సెప్టెంబరు 5న జాబ్‌మేళా

**సీతంపేట, ఆగస్టు 30 (వార్త):** సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో వచ్చేనెల 5న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు పీవో వి.వి.రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో అమెజాన్ కంపెనీ పాల్గొని 300 మంది ఉద్యోగాలకు ఇంటర్వ్యూ చేస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు 10వ తరగతి పాసై, 18 నుండి 30 సంవత్సరాల వయస్సుగల పురుషులు, స్త్రీలు అర్హులని తెలి పారు. అభ్యర్థులకు ఇంగ్లీష్ చదవడం వచ్చివుండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.15,800 జీతంతో పాటు అదనంగా ఇన్సెంటివ్ కూడా ఇస్తారని, నెలకు 22 రోజులు పనిదినాలని, రోజుకు పది గంటలు పనిచేయాల్సివుంటుందన్నారు. జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులు నెల్లూరు సమీపంలో తమిళనాడు సరిహద్దు ప్రాం తంలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9885108092 నంబరుకు సంప్రదించాలన్నారు.

## పీహెచ్‌సీలో సౌకర్యాల కల్పనకు చర్యలు:ఎంపీపీ

**నందిగాం, ఆగస్టు30 (వార్త):** నౌగాం ప్రాథమిక ఆరోగ్య కేం ద్రంలో



రోగులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి తెలిపారు. శుక్రవారం నౌగాంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం వైద్యురాలు పి.అంజలి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో రోగులకు అవసరమయ్యే బెడ్లు, చైర్లు, టేబులు ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. పీహెచ్‌సి పరిధిలో రోగులకు అందు తున్న వైద్య సేవలు, రోజువారి ఓపి, పేషెంట్ల వివరాలు, మందులు సరఫరా జరుగుతున్న తీరు గురించి వైద్యశాఖ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అంటూ వ్యాధులు ప్రబలడంతో పాటు జ్వరాలు అధికంగా ఉన్న దృష్ట్యా వైద్య శాఖ సిబ్బంది పూర్తిస్థాయిలో రోగులకు సర్వీస్ అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు చిన్ని జోగారావు యాదవ్, సర్పంచులు పుష్ప సత్యం, తమిరి పుణ్యవతి దేవేంద్రరావు ఎంపీటీసీ సభ్యులు బార్నాన బాలకృష్ణ, వైద్యశాఖ సిబ్బంది సూర్యనారాయణ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి

**పలాస, ఆగస్టు 30 (వార్త):** నెమలి నారాయణపురం గ్రామ సమీప జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పలాసకు చెందిన గొర్రెల కాపరి కడమట ఆదినారాయణ (54) సమీపంలో ఉన్న తన గొర్రెల మంద వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన ఆదినారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ సీఐ దాడి మోహనరావు, ఎస్సై రేవతి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఆర్టీసీ డ్రైవర్ రామారావు నిజాయితీ



**శ్రీకాకుళం టౌన్ ఆగస్టు 30, (వార్త):** శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్లే ఆర్టీసీ బస్సులో ఒక మహిళ పర్సును పోగొట్టుకుంది. ఆ పర్సును ఆర్టీసీ డ్రైవర్ రామారావు కంటపడింది. అందులో పదహారు వేల రూపాయలు నగదు ఉండటంతో డ్రైవర్ రామారావు ఆర్టీసీ అధికారులకు సమాచారం అందించారు. ప్రయాణికురాలు పర్సు పొయిన విషయాన్ని ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆ నగదును ఆమెకు అందజేశారు. డ్రైవర్ రామారావు నిజాయితీని ఆర్టీసీ అధికారులు, ప్రయాణికులు అభినందించారు.



## ప్రతిఒక్కరూ పౌష్టికాహారం పొందాలి

**హిరమండలం, ఆగస్టు 30 (వార్త):**గుడ్డు మంచి పౌష్టికాహారమని... ప్రతీ ఒక్కరూ గుడ్డును ప్రతీ రోజు ఆహారంగా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు టి.కేశవరావు సూచించారు.శుక్రవారం మండలం కేంద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్ధులకు అందజేస్తున్న గుడ్డును పలువురు విద్యార్ధులు ఆహారంగా స్వీకరించకపోవటం పట్ల గుడ్డు ఆవశ్యకతపై విద్యార్ధులకు అవగాహన కల్పించారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారమైన గుడ్డును ప్రతీ రోజు తినటం వలన మంచి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చున్నారు.ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందజేసిన గుడ్లను మిరియాల పొడి వేసి విద్యార్ధులకు అందజేసారు. ఈయనతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది,విద్యార్ధులు ఉన్నారు

## వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి



**హిరమండలం, ఆగస్టు30 (వార్త):** సెప్టెంబర్ 7నుంచి నిర్వహించ నున్న వినాయక చవితి ఉత్సవాలకు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వినాయక మండపాలు ఏర్పాటు చేస్తే వాటిపై చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ మహ్మద్ యసీన్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకునేటప్పుడు పోలీస్ శాఖ నుంచి అనుమతులు పొందాలన్నారు.అలాగే ఐదుగురు కన్నా మించి సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు.నియమ నిబంధనలు ప్రకారంగా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని, వినాయక విగ్రహాలు నిమజ్జన కార్యక్రమంలో పోలీస్ శాఖకు సమాచారం అందజేయాలని ఆయన సూచించారు.

## సత్యసాయి సేవలు మరింత విస్తృతం



**హిరమండలం, ఆగస్టు 30 (వార్త):** సత్యసాయి సేవలు మరింత విసృతం చేయటం జరుగుతుందని సత్యసాయి సేవా సంస్థ నూతన కన్వీనర్ ఊణ్ణ వెంకటరమణ అన్నారు.శుక్రవారం హిరమండలం మేజర్ పంచాయతీ దేవరశెట్టి వీధిలో ఉన్న భగవాన్ సత్యసాయి సేవా సమితి కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి బాబా జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని సమితిలో ఘనంగా నిర్వహించేందుకు చర్యలు, సేవలు, గ్రామసేవలు, లక్ష గృహనామ సంకీర్తన, ప్రేమతరువు, నూతన మందిర నిర్మాణంకు చర్యలు తీసుకుంటామన్నారు. సత్యసాయి భక్తులతో పాటు ప్రతీ ఒక్కరూ తమకు సహకరించాలని ఆయన సూచించారు. ఈ మేరకు కన్వీనర్‌గా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, జోనల్ కన్వీనర్ బెహరా సురేష్ (చంటి మాస్టారు )లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

**హిరమండలం, ఆగస్టు 30 (వార్త):** పర్యావరణ పరిరక్షణకు మొక్కలు చాలా కీలకమని మండల విద్యాశాఖాధికారి కె.రాంబాబు సూచించారు.వనం – మనంకార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రం కేజీబీవి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరంక్షించే బాధ్యత కూడా అందరిపైనా ఉందన్నారు.పుట్టిన రోజులకు,తల్లిదండ్రుల పెళ్లిరోజులకు వారి పేరిట మొక్కలను నాటి వాటిని రక్షించాలన్నారు.ఈ కార్యక్రమంలో కేజీబీవి ప్రిన్సిపల్ ఎస్.కృష్ణవేణి,ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.




# నగదు రికవరీ చేయండి

*** జిల్లా నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకుడు చిట్టిరాజు**



**మెళియాపుట్టి, ఆగస్టు 30 (వార్త):** సామాజిక భద్రత పింఛన్ పంపిణీలో మండలంలో పలువురు పెన్షన్దారులు మృతి చెందినప్పటికీ కూడా వారి వారి ఖాతాలలో పెన్షన్ సొమ్ము జమైనట్లు బృందం సభ్యులు గుర్తించారని, ఇలా ఎక్కడెక్కడ పంపిణీ చేశారో ఆ నగదును రికవరీ చేయాలని పిడి చిట్టిరాజు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లను ఆదేశించారు. మెళియాపుట్టి మండలంలో ఉపాధి హామీ పథకం, సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ, ప్రభుత్వ భవన నిర్మాణాలను సామాజిక తనిఖీ బృందం వారు క్షేత్ర స్థాయిలో సందర్శించి తనిఖీ చేసిన వ్యవహారానికి సంబంధించి దాని యొక్క నివేదికను మెలియాపుట్టి మండల కేంద్రంలో గల స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం నాడు జరిగిన ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకులు చిట్టిరాజు మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో 26.44 కోట్ల రూపాయలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఉపాధి హామీ పథకం ద్వారా 18 కోట్ల 86 లక్షల రూపాయలు ప్రజలకు వేతనాల ద్వారా అందించినట్లు తెలియజేశారు. పలు పంచాయతీలలో వేతనదారులు కొన్నిచోట్ల పనులకు లేటుగా హాజరు కావడంతో మస్టర్లలో దిద్దుబాట్లు చోటు చేసుకున్నాయన్నారు.కొన్ని పంచాయతీలో బాల కార్మికుల ద్వారా పనులు చేస్తున్నరని, అలాగే గ్రామాలలో లేనటువంటి వారికి కూడా మస్టర్లు వేసినట్టుగా పలువురు సర్పంచులు ప్రజావేదిక దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై ఎంక్వయిరీ చేయించి తగు చర్య తీసుకుంటామని పిడి తెలియజేశారు. అలాగే వేతనదారులు అడిగిన మేరకు పనులు కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. రైతు పనైనా, ఉపాధి పని అయినా ఒకే విధంగా చేయాలన్నారు. గ్రామాలలో ఉన్న ఎస్.హెచ్. జి మహిళా సంఘాల ద్వారా మొక్కలు నాటి విధముగా చూడాలన్నారు.

## ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

**బూర్జ, ఆగస్టు 30(వార్త):** ప్రజల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఏపీ పేట సర్పంచ్ కొరికాన వెంకట శివ సాయి సీతారామరాజు అన్నారు. బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న కేకే రాజపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం ప్రతి ఒక్కరు బాధ్యతని ఆయన స్పష్టం చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ పావని 35 మందికి వైద్య సేవలు అందించారు. వీరిలో 15 మంది మలేరియా పరీక్షలు నిర్వహించడంతోపాటు ఐదుగురికి రక్త పరీక్షల నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పావని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కాచి వడబోసిన నీళ్ళు మాత్రమే తాగాలని, తాజా పదార్థాలను తినాలని, భోజనం చేసే ముందు సబ్బుతో చేతులు పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా చిన్న జ్వరం వచ్చిన అందుబాటులో ఉన్న ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని కోరారు. ఈ శిబిరంలో ఏఎన్ఎం బి ఆమని ఎం ఎల్ హెచ్ పి జి లక్ష్మి ఆశా వర్కర్లు, ఎస్.లక్ష్మి, జి.సత్యవతి, సిహెచ్ రాజేశ్వరి, ఏ శాంతమ్మ, వైద్య సిబ్బంది ఉన్నారు.



## సబ్ స్టేషన్ స్థలం పరిశీలన



**కొత్తూరు,ఆగస్టు 30 (వార్త):** కొత్తూరు లోని ఎలక్ట్రికల్ 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న సబ్‌స్టేషన్‌కు అవసరమైన స్థలాన్ని శుక్రవారం మండల వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాద్ రావు పరిశీలించారు. ఆయన వెంట ఎలక్ట్రికల్ జేఈ నిరంజన్ కుమార్, లైన్ ఇనస్పెక్టర్ భీమరావు, కోయిలాపు సంజీవరావు, పడాల వెంకట కృష్ణ, శమ్మాన ఉదయ్ కుమార్ ఉన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

**కొత్తూరు,ఆగస్టు 30 (వార్త) :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీము ఎట్టి పరిస్థితిల్లో ఆమోదయోగ్యం కాదని జిల్లా కార్యదర్శి బోడ శ్రీను ఆధ్వర్యంలో యూటీయఫ్ రాష్ట్ర నాయకులు దండు ప్రకాశరావు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె విజయ్ కుమార్, ఎ.శోభన్ బాబులు తెలిపారు. శుక్రవారం కొత్తూరు మండల తాశీల్దార్ కార్యాలయం వద్ద యూటిఎఫ్ ఆధ్వర్యంలో యూపిఎస్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. గత ప్రభుత్వం సిపిఎస్ స్థానంలో తెచ్చిన జిపిఎస్ విధానాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయులు తిరస్కరించిన విషయము విధితమే,ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయకపోగా దాని స్థానంలో యుపిఎస్ విధానాన్ని తీసుకురావడాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసగించడమని తెలిపారు, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.అనంతరం వినతి పత్రాన్ని డిప్యూటీ తాశీల్దార్ వై. అనంత్ కుమార్ కి అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శోభన్ బాబు, కె.విజయ్ కుమార్,నాయకులు దండు ప్రకాశరావు,బి.స్వర్ణలత, టి.గణపతి, భద్రయ్య, భుజంగరావు,టి.రవి, ప్రసాదు, బి.గణేష్,పి.దినేష్, ఉమా మహేష్, పి.ధనంజయరావు, పి బాలరాజు,కె చంద్రరావు, రమేష్, అవినాష్ పాల్గొన్నారు.

# పురంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం

*** వనం మనం కార్యక్రమంలో మొక్కలు నాటిన అశోక్ * అన్నా కాంటీన్ పనులు వేగవంతం చేయండి**

***వాటర్ ట్యాంకర్ ప్రారంభించిన ఎమ్మెల్యే బెందాళం అశోక్**



**ఇచ్ఛాపురం, ఆగస్టు 30(వార్త):** మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ బెందలం అశోక్ శ్రీకారం చుట్టారు. నాలుగో వార్డ్‌లో పది లక్షల రూపాయలతో సిసి కాలువ నిర్మాణ పనులకు శంఖుస్థాపనచేశారు. అదే వార్డులో మరో 6 లక్షల రూపాయలతో ప్రశాంత్ నగర్ కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం వనం మనం కార్యక్రమంలో మొక్కలు నాటారు. మున్సిపల్ వాటర్ ట్యాంకర్లను ట్రాక్టర్ నడిపి ప్రారంభించారు. అన్న కాంటీన్ పనులు వేగవంతం చేయాలని



కాంట్రాక్టర్ నారాయణరెడ్డిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి ,వైస్ చైర్పర్సన్ లు ఉలాల భారతీ దివ్య, లాభాల స్వర్ణమని , కమిషనర్ రమేష్, కౌన్సిలర్లు పత్రి తవిటయ్య, ఆసి లీల రాణి, కాళ్ళదిలీప్ యాదవ్, గేదెల శేఖర్, పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు కాళ్ళ ధర్మారావు ,రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ, బీసీ సాధికార సంస్థ చైర్మన్ కొండశంకర్ రెడ్డి ,నియోజకవర్గ బిజెపి కన్వీనర్ బుద్దాల నిర్మలారెడ్డి పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## బీజేపీ నేత పున్నయ్యకు నివాళి

**పొందూరు, ఆగస్టు 30 (వార్త):** భారతీయ జనతా పార్టీ దళిత మోర్చా సీనియర్ నాయకులు పున్నయ్య (58) అకాల మరణం చెందారు. వారి అంత్యక్రియలను కింతలి గ్రామంలో శుక్రవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు. పున్నయ్య పార్థివ దేహానికి బీజేపీ జెండాను పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు కప్పి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర ఆర్టిఐ కో కన్వీనర్ కిల్లి శ్రీరామమూర్తి ఉన్నారు.



## మొక్కల పెంపకం..

* పర్యావరణాన్ని అందరూ కాపాడాలి * జిల్లాలో 21 శాతం ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి పెంచాలి * జిల్లాలో ఎరువుల కొరతను తీరుస్తా * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు * జిల్లాలో ఘనంగా వనం మనం కార్యక్రమం

# సామాజిక బాధ్యత



**శ్రీకాకుళం, ఆగస్టు 30 (వార్త):** పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, పశు సంవర్ధక, మత్స్య, డెయిరీ అభివృద్ధి శాఖా మాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ప్రభుత్వ బాలుర కళాశాల ఆవరణలో అటవీశాఖ ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, స్థానిక శాసన సభ్యుడు గొండు శంకర్‌తో కలసి శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అనే నినాదంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతోందన్నారు. సామాజిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని మొక్కలు నాటాలని చెప్పారు. వాతావరణ సమతుల్యం లేక కొన్ని ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నాయి, కొన్ని ప్రాంతాల్లో వర్షాలు పడటం లేదని, అందుకే ప్రభుత్వం మొక్కలు నాటు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాల విభజన వలన జిల్లాలో 21 శాతం మాత్రమే పచ్చదనం ఉందని మొక్కలు కార్యక్రమంతో 50 శాతానికి పెంచుకోవాలని, అందరూ మొక్కలు నాటేందుకు పూర్తి స్థాయిలో బాధ్యత తీసుకోవాలని హితవు పలికారు. ప్రతి ఒక్కరూ పుట్టిన రోజు, పెళ్లి రోజు, తదితర కార్యక్రమాలకు మొక్కలు నాటాలన్నారు. ట్రీ గార్డ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా పెద్ద ఎత్తున పండగ వాతావరణంలో మొక్కలు నాటాలని చెప్పారు. మొక్కలకు సమస్య లేదని, ఎన్ని మొక్కలు అవసరమో తెలియజేస్తే తెప్పించే బాధ్యత తీసుకుంటానన్నారు. ఎవరైనా నన్ను కలవాలని వస్తే బొకేలు, పూలదండలు తీసుకురావద్దని మొక్కలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్తీక మాసంలో వన మహోత్సవాన్ని ముగించుకుందామని పేర్కొన్నారు. జిల్లాలో ఎరువుల కొరతపై ప్రజా ప్రతినిధులు జడ్పీ సమావేశంలో తెలియ జేయగా, జిల్లాలో ఎరువులు ఎంత అవసరం కావాలన్నా కొరత లేదన్నారు. ఎరువుల కొరతపై ఇప్పటికే మార్క్‌ఫెడ్ ఎండితో మాట్లాడినట్లు చెప్పారు. వాస్తవాలు తెలియజేయాలని చెప్పారు. ఎవరైనా ప్రజా సేవకులుగా భావించాలన్నారు. అందరి భాగస్వామ్యంతో ముందుకు వెళదామన్నారు. హరితాంధ్ర కోసం అడుగేద్దాం ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటుదామన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లాలో 30 లక్షల మొక్కలు నాటుటకు లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం నవంబరు వరకు జరుగుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లోను మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. విద్యార్థులు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. మొక్కలు నాటుటకు ఒక కమిటీ ఉందన్నారు. ఉద్యాన వన శాఖ లో 50 వేల మొక్కలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ నాటే మొక్కలు విద్యార్థులు సంరక్షించాలని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలు, పోలీసు స్టేషన్, యూనివర్సిటీ, ఐఐఐటిలలో కూడా మొక్కలు నాటుతామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొనాలన్నారు. మొక్కలు పెద్ద ఎత్తున నాటితే ఆక్సిజన్ విడుదల అవుతుందన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు నాటు కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతన్నారు. అందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని చెప్పారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఎఫ్ఓ ఎస్. వెంకటేష్, ఆర్డీఓ సిహెచ్ రంగయ్య, ఉద్యానవన శాఖ ఎడి ప్రసాదరావు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, సబ్ డిఎఫ్ఓ నాగేంద్ర, ఎఫ్ఆర్ఓలు నిహారిక, జగదీశ్వరరావు, మురళీ కృష్ణ నాయుడు, రాజశేఖర్, ఎఫ్ఆర్ఓ సోషల్ ఫారెస్టు కె. రాజశేఖర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, కళాశాల ప్రిన్సిపాల్ సూర్య చంద్రరావు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.




### వచ్చేనెల 11 నుంచి

## ఉచిత ఇసుక నూతన విధానం

### గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా

**శ్రీకాకుళం, ఆగస్టు30(వార్త):** రాష్ట్రంలో ఉచిత ఇసుక నూతన విధానాన్ని వచ్చేనెల 11 నుంచి అమలు చేయనున్న దృష్ట్యా నూతనంగా జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. ఇసుక విధానంపై శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మైనింగ్ శాఖ ఉన్నతాధికారులతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. జిల్లా నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, గనులు, రవాణాశాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ ఇసుకకు సంబంధించిన ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెంబర్ 18005994599, అలాగే dmgapsandcomplaints@yahoo.com ఈ మెయిల్‌లను ప్రచారం చేయాలన్నారు. ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్ రూపొందిస్తున్నామని, దాని ప్రారంభానికి ముందస్తుగా అవసరమైన కార్యకలాపాల కాలక్రమం, గడువు తేదీల గురించి వివరించారు. మ్యాన్ పవర్/ ఏజెన్సీల నియామకం, స్టాక్‌యార్డ్ ఇన్‌ఛార్జ్‌లు, సెక్యూరిటీ పర్సనల్, ఇతర స్టాల్‌ల నియామకం, ఇన్‌ఛార్జ్‌లు, సిబ్బందికి శిక్షణ, బల్క్ వినియోగదారుల కోసం ధృవీకరణ అధికారుల శిక్షణ, టెండర్ ప్రక్రియ ద్వారా తవ్వకం/లోడింగ్/ అంతర్గత రవాణా సంస్థలు తదితర అంశాలపై చర్చించారు. ఇసుక రవాణా ధరలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి శ్రీకాకుళం టెక్కలి గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు ఎస్కేవి సత్యనారాయణ, ఫణి భూషణ్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గంగాధర్, నీటిపారుదల శాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకర్ రావు తదితరులు హాజరయ్యారు.



# పేరుకే సేంద్రీయం


* అధికారుల్లో కొరవడిన 'చెత్త'శుద్ధి
* నిరుపయోగంగా యంత్రాలు
* లక్షలాది రూపాయలు వృధా

**ఆమదాలవలస,ఆగస్టు 30 (వార్త):** ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలో తడి, పొడి చెత్తలను సేకరించి సేంద్రియ ఎరువులు తయారు చేసే ప్రక్రియ నామ మాత్రంగా కూడా జరగడం లేదు. సేంద్రియ ఎరువులు తయారు చేసేందుకు ప్రభుత్వం ఇంటింటా



చెత్త సేకరణకు సైతం పన్ను విధించింది. అయితే పన్నులు వసూలు చేసినా సేంద్రియ ఎరువుల తయారీ విధానం నామమాత్రమైనా జరగలేదు. పురపాలక సంఘం పరిధిలో సేకరించిన తడి, పొడి చెత్తలను వేరు చేసి తాళ్లవలస డంపింగ్ యార్డుకు తరలించి, అక్కడ సెగ్రిగేషన్ ప్రక్రియ చేసిన తరువాత సేంద్రియ ఎరువులు తయారు చేయాలి. దీని వలన పారిశుద్ధ్యం మెరుగుపడడంతో పాటు, సేంద్రియ ఎరువులను విక్రయించడం ద్వారా పురపాలక సంఘానికి ఆదాయం పెరుగుతుంది. అయితే క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే.. ఆమదాలవలస పురపాలక సంఘంలో మాత్రం ఈ ప్రక్రియ పడకేసింది. సెగ్రిగేషన్ ప్రక్రియ కోసం సుమారు రూ.7 లక్షలు తో కొనుగోలు చేసిన పల్వరైజర్ యంత్రం మరమ్మతులకు గురై మరుగున పడింది. అదే విధంగా డంపింగ్ యార్డులో నిర్మించిన షెడ్డులు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.





కనీసం అక్కడ కాపలాదారుని కూడా నియమించకపోవడం మరింత దౌర్భాగ్యం.. ప్రస్తుతం ఈ ప్రాంతం గంజాయి, మద్యం, ఇతర మాదక ద్రవ్యాలు సేవించేవారికి, అసాంఘిక కార్యకలాపాలకూ అడ్డాగా మారింది. ఇదంతా తెలిసిన పురపాలక సంఘం అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికయినా అధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413